సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 1 । మే । 2025



సోమశిలలో 51.180 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 51.180 టీఎంసీల నీరు ఉన్నాయి. దిగువ వివిధ కాలువలకు 580 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.98,750
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,980
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,250
నవర (8 గ్రాములు)	రూ.74,000

గరిష్ఠం/కనిష్ఠం 38.8 /28.0

వాతావరణం

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉంటాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. బుధవారం గాలిలో తేమ 62 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలిసెట్

- 552 మంది విద్యార్థులు గైర్హాజరు



నెల్లూరు (టౌన్): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్ష జిల్లా వ్యాప్తంగా నెల్లూరు, కావలి, ఆత్మకూరు, కందుకూరు ప్రాంతాల్లోని మొత్తం 10 సెంటర్లల్లో జరిగింది. పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించారు. విద్యార్థులను గంట ముందుగా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. విద్యార్థులను కేంద్రాల ముఖ ద్వారాల వద్ద క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కేంద్రంలోకి అనుమతించారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 552 మంది విద్యార్థులు గైర్హాజరయ్యా రు. జిల్లాలో 4,080 మంది విద్యార్థులకు 3,528 మంది హాజరయ్యారు. ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఏసుదాసు పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

రాష్ట్ర మున్సిపల్ కమిటీలో పదవులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీలో జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులకు చోటు కల్పించారు. రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీ జనరల్ సెక్రటరీగా అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా దాసరి మాల్యాద్రిలను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం ప్రకటన విడుదల చేసింది.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఆనం

ఆత్మకూరు: ఆత్మకూరులో సీఎం చంద్రబాబు గురువారం పర్యటించనున్న నేపథ్యంలో ఎంఎస్ఎంఈ పార్కు వద్ద ప్రజావేదిక ఏర్పాట్లను బుధవారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ పరిశీలించి సిబ్బందికి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ కృష్ణకాంత్ బందోబస్తు ట్రయిల్ రన్ నిర్వహించారు. బాంబ్, డాగ్‌స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఆర్డీఓ బి పావని, ఆత్మకూరు, కావలి, కందుకూరు, నెల్లూరు, రూరల్ డీఎస్పీలు, స్పెషల్ పార్టీ పోలీసులు, ఏఆర్ పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు

నెల్లూరు సిటీ: సీఎం పర్యటనకు పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో అడిషనల్ ఎస్పీ, 8 మంది డీఎస్పీలు, 30 మంది సీఐలు, 73 మంది ఎస్సైలు, 149 ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుల్స్, 267 మంది కానిస్టేబుల్స్, 67 మంది మహిళా కానిస్టేబుల్స్, 200 హోంగార్డులు, 200 మంది ఏఆర్‌లు, ఇతర జిల్లాల నుంచి 80 మంది బందోబస్తు నిమిత్తం బుధవారం ఆత్మకూరుకు తరలి వెళ్లారు. మొత్తంగా 1,075 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిద్దీపురంలో విషాదఛాయలు



జీవన్ చంద్రారెడ్డి (ఫైల్)


సంగం: కోవూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుండాల జీవన్ చంద్రారెడ్డి మృతి చెందడంతో సంగం మండలం సిద్దీపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సిద్దీపురం గ్రామానికి చెందిన గుండాల సతీష్ చంద్రారెడ్డి, విజయమ్మ దంపతుల కుమారుడు జీవన్ చంద్రారెడ్డి నారాయణ మెడికల్ కళాశాలలో మూడో సంవత్సరం మెడిసిన్ చదువుతున్నాడు. జీవన్ గ్రామంలో అందరితో కలివిడిగా ఉండేవాడు. దీంతో సిద్దీపురం గ్రామం శోకసంద్రంగా మారిపోయింది. ఒక్కగానొక్క మగ పిల్లవాడు కావడం, డాక్టర్‌గా తిరిగి వస్తాడనుకుంటే ఇలా జరిగింది ఏమిటి దేవుడా అంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వారిని ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు.


శోకసంద్రంలో బాలచంద్రారెడ్డి

సంగం మండల వైఎస్సార్‌సీపీ నేత గుండాల బాలచంద్రారెడ్డి తమ్ముడు గుండాల సతీష్ చంద్రారెడ్డి కుమారుడు జీవన్ చంద్రారెడ్డి మృతి చెందడంతో బాలచంద్రారెడ్డి శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన నెల్లూరు జీజీహెచ్‌కు తరలివెళ్లి అక్కడ జీవన్ చంద్రారెడ్డి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. విషయం తెలిసిన వెంటనే గుండాల బాలచంద్రారెడ్డికి మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఫోన్ చేసి పరామర్శించారు.

సోమశిల ఆప్రాన్ అంతేనా

జిల్లా జల వరప్రదాయని అయిన సోమశిల ప్రాజెక్ట్‌పై చంద్రబాబు నిర్లక్ష్యం చూపుతూనే ఉన్నారు. గతంలో 14 ఏళ్లు సీఎంగా ఉన్నా.. ప్రాజెక్ట్ పురోభివృద్ధిలో ఎలాంటి మార్పు లేదు. ఏటా బడ్జెట్‌లో అరకొరగా నిధులు కేటాయించడం, మెయింటెనెన్స్ పేరుతో ఆరగించడం పరిపాటిగా మారింది. ఈ సారి అధికారంలోకి వచ్చాక కూడా ప్రాజెక్ట్ ఆప్రాన్ మరమ్మతుల విషయంలోనూ నిర్లక్ష్యం చేస్తున్నారు. గతేడాది సీఎం కాగానే సోమశిలను సందర్శించి ఆరు నెలల్లో ఆప్రాన్ పనులు పూర్తి చేస్తామంటూ హామీ ఇచ్చినా.. పది నెలలైనా 30 శాతం పనులు కూడా జరగలేదంటే ప్రాజెక్ట్‌పై సీఎం చిత్తశుద్ధికి అద్దం పడుతోంది.





ఆత్మకూరు: అర్ధాంతరంగా నిలిచిన సోమశిల డ్యామ్ ఆప్రాన్ పనులు

ఆరు నెలల్లో పూర్తి చేస్తామని స్వయంగా సీఎం హామీ

- 10 నెలలైనా 30 శాతం కూడా పూర్తి కాని వైనం
- బిల్లులు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్ పనుల నిలిపివేత
- జిల్లా వరప్రదాయని ప్రాజెక్ట్ పనుల పైన నిర్లక్ష్యం

ఆత్మకూరు: అన్నపూర్ణగా ఖ్యాతిగాంచిన సింహపురికి సోమశిల జల వర ప్రదాయని. చంద్రబాబు ప్రభుత్వంలో ఈ ప్రాజెక్ట్ నిర్లక్ష్యానికి గురవుతూనే ఉంది. 78 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్ట్‌ను చంద్రబాబు తొమిదేళ్లు సీఎంగా ఉండగా సమగ్ర సోమశిల కలగానే మిగిలిపోయింది. బ్యాక్ వాటర్ ముంపు వాసులకు పరిహారం ఇవ్వకుండా, వారికి పునరావాసం కల్పించకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో 50 టీఎంసీలు కూడా నిలబెట్టలేని పరిస్థితి. మహానేత వైఎస్సార్ ముఖ్యమంత్రి కాగానే ముంపు వాసుల సమస్యలు పరిష్కరించి పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేశారు. 48 టీఎంసీలకే పరిమితమైన సోమశిల నీటి సామర్థ్యాన్ని రెండు దశల్లో 78 టీఎంసీల సమగ్ర సోమశిల కలను సాకారం చేశారు.

ప్రచారమే తప్పు.. పురోగతి లేదు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాం ఐదేళ్లు భారీ వర్షాలు కురవడం, తరచూ వరదలు రావడంతో సోమశిల దిగువన ఆప్రాన్ దెబ్బతినింది. ఈ క్రమంలో గత ప్రభుత్వంలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆప్రాన్ పనులు చేపట్టేందుకు రూ.99 కోట్లు నిధులు కేటాయించారు. అయితే వరదలు, టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే సరికి ప్రభుత్వం మారింది. తాజాగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు గతేడాది ఆగస్టులో స్వయంగా సోమశిల జలాశయం పరిశీలించి సీడబ్ల్యూసీ అధికారులు, మంత్రులతో కలిసి డ్యామ్‌ను కలియ తిరిగి ఆరు నెలల్లో పూర్తి చేస్తామంటూ ఆర్భాటంగా హామీలు గుప్పించారు. రూ.99 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే సోమశిల ప్రాజెక్ట్ విషయంలో ప్రచారం తప్పు.. పురోగతి లేదనేది ఆగిపోయిన డ్యామ్ ఆప్రాన్ పనులు పరిశీలిస్తే అర్థమవుతోంది. జలాశయం వద్ద అత్యంత కీలకమైన ఆప్రాన్ పనులు అర్ధాంతరంగా నిలిచిన విషయం తెలిసిందే.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

30 శాతం కూడా జరగని పనులు

గతేడాది డిసెంబరు వరకు సాగిన ఆప్రాన్ పనులు తుఫాన్, వర్షాల కారణంతో కొన్ని రోజులు నిలిపివేశారు. అనంతరం తిరిగి ప్రారంభించలేదు. అధికారులు కాంట్రాక్టర్‌ను అడిగితే బిల్లులు చెల్లిస్తే గానీ పనులు మొదలు పెట్టలేనని మెలిక పెట్టాడు. దీంతో ఐదు నెలలుగా పనులు నిలిచిపోయాయి. సుమారు 10 నెలల సమయం పూర్తయినా ఆప్రాన్ పనులు కేవలం 30 శాతం కూడా జరగలేదని తెలుస్తుంది. విలువైన వేసవి కాలాన్ని వినియోగించుకొని త్వరితగతిన కీలకమైన ఆప్రాన్ పనులు పూర్తి చేస్తేనే డ్యామ్‌కు భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలు జరగవు. ఆప్రాన్‌పై రెండో కాంక్రీట్ ఫ్లోరింగ్ వేయాల్సి ఉంది. చుట్టూ మెష్ కట్టి శ్లాబు పనులు చేయాల్సిన పనులు మిగిలిపోయి ఉన్నాయి. ఇవన్నీ పూర్తయితేనే ఆప్రాన్ పరిస్థితి ఓ దశకు చేరుకుంటుంది. మరి ఆరు నెలలకే పూర్తి చేస్తామన్న సీఎం హామీకే అధికారులకు బాధ్యతలేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

హవ్వా.. నవ్విపోదురు గాక..

'మా చెల్లికి జరగాలి మళ్లీ.. మళ్లీ పెళ్లి' అన్నట్లుగా ఉంది కూటమి నేతల తీరు. ఆత్మకూరు సమీపంలో నారంపేట వద్ద ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్క్ నిర్మాణంలో కూటమి ప్రభుత్వం పాత్ర పైసా కూడా లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రిగా ఉన్న మేకపాటి గౌతమ్ రెడ్డి హయాంలో ఈ పారిశ్రామికవాడ రూపుదిద్దుకుంది. ఆయన హయాంలోనే దీన్ని ప్రారంభించారు. అయితే తాజాగా అధికారంలోకి వచ్చాక పారిశ్రామికవాడలో శిలాఫలకాలపై తమ పేర్లు వేసుకునేందుకు చంద్రబాబుతో మరోసారి ప్రారంభించడాన్ని చూసి జనం విస్తుపోతున్నారు.



గౌతమ్‌రెడ్డి ఆవిష్కరించిన ఎంఎస్ఎంఈ పార్క్ పైలాన్ (ఫైల్)

- ఎంఎస్ఎంఈ పార్క్ రెండోసారి ప్రారంభం
- గతంలోనే మంత్రిగా గౌతమ్‌రెడ్డి ప్రారంభించిన వైనం
- తన మార్కు వేసుకునేందుకు మంత్రి ఆనం ప్రయత్నం
- ప్రస్తుతం చేసిన పనుల నిధులు సైతం గత ప్రభుత్వంలో మంజూరైనవే

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పరిధిలో నారంపేట వద్ద గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్క్‌లో దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి హయాంలో రూ.30 కోట్ల వ్యయంతో భూమిని చదును చేసి రహదారులు, మురుగు, వరదనీటి కాలువల నిర్మాణాలు జరిగాయి. గతంలో సేకరించి ఉన్న భూమికి అదనంగా 70.24 ఎకరాలు సేకరించి భూ అభివృద్ధి చేసి రోడ్లు నిర్మించి 2021 అక్టోబరులో అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబుతో కలిసి గౌతమ్‌రెడ్డి ఎంఎస్ఎంఈ పార్క్‌ను ప్రారంభించారు. ఇందులో 73.91 ఎకరాల్లో కంపెనీలు యూనిట్‌లు ఏర్పాటు చేసుకోవడానికి 323 ప్లాట్లను అభివృద్ధి చేసేలా, 10.05 ఎకరాల్లో రెడీబిల్ట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. పారిశ్రామికవాడలో 5.49 ఎకరాల్లో ఇళ్ల నిర్మాణాలకు, 21.38 ఎకరాల్లో గ్రీనరీ పెంపకానికి, నీటి నిల్వ ట్యాంకుల ఏర్పాటు, తదితర వాటికి కేటాయించారు. మంత్రి గౌతమ్‌రెడ్డి మరణానంతరం ఎమ్మెల్యేగా గెలిచిన మేకపాటి విక్రమ్‌రెడ్డి నారంపేట పారిశ్రామికవాడపై ప్రత్యేక దృష్టి సారించడంతో అక్కడ చేయాల్సిన పనులు మళ్లీ జోరందుకున్నాయి. పరిశ్రమల శాఖ అధికారులు 2022 ఆగస్టులో పలు చిన్న కుటీర పరిశ్రమలు స్థాపించేందుకు ఆసక్తి గల వారికి అవకాశం కల్పించారు. గత ప్రభుత్వంలోనే రూపుదిద్దుకున్న ఈ పారిశ్రామికవాడకు కూటమి ప్రభుత్వం మరోసారి ప్రారంభోత్సవం చేయనుంది.

కూటమి ప్రభుత్వ పాత్ర ఉందా?

'నవ్విపోదురు గాక.. నాకేటి సిగ్గు' అన్నట్లు కూటమి నేతలు గత ప్రభుత్వం చేపట్టిన పనుల శిలాఫలాకలపై తమ పేర్లు వేసుకునేందుకు మళ్లీ మళ్లీ ప్రారంభించడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నారంపేట ఎంఎస్ఎంఈ పార్క్‌కు సంబంధించి కూటమి ప్రభుత్వం పాత్ర పైసా కూడా లేదు. అధికారంలోకి వచ్చాక ఈ పారిశ్రామికవాడకు రూపాయి నిధులు కేటాయించిన దాఖలాలు కూడా లేవు. అయితే కూటమి ప్రభుత్వం తామే ఎంఎస్ఎంఈ పార్క్‌ను సాధించామని క్రెడిట్ కొట్టేసేందుకు, గత ప్రభుత్వంలో మంజూరైన రూ.53 లక్షలతోనే ప్రస్తుతం కొన్ని రోడ్లు తాత్కాలికంగా ఏర్పాటు చేసి అంతా తామే చేసినట్లు చెప్పుకోవడం గమనార్హం. నారంపేట పారిశ్రామికవాడ దివంగత పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి మానస పుత్రిక అనేది జగమెరిగిన సత్యం. దీని కోసం ఆయన పడిన తపన, చేసిన కృషి ఫలితంగానే రూపుదిద్దుకుంది.

ఆశలు చిదిమేసి.. ఆప్తులను వదిలేసి..

- కొడుకా.. నువ్వులేని జీవితం మాకెందుకు..
- స్నేహితులారా.. మమ్మల్ని వదిలి వెళ్లిపోయారా..
- కడసారి చూసేందుకు తరలివచ్చిన మెడికోలు
- తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో మిన్నంటిన రోదనలు
- ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మెడికోలు మృతి.. కోమాలో మరొకరు



పెద్దాస్పత్రికి పెద్ద సంఖ్యలో చేరుకున్న మెడికల్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు



రోదిస్తున్న జీవన్ చంద్రారెడ్డి తల్లి విజయలక్ష్మి, సముదాయిస్తున్న విద్యార్థినిలు

అప్పటి వరకు స్నేహితులతో సరదాగా గడిపారు. అంతలోనే ఘోర ప్రమాదంలో భావి వైద్యులు అసువులు బాసారు. తల్లిదండ్రుల కలలను, ఆశలను చిదిమేసి.. ఆప్తులను వదిలేసి అనంత వాయువుల్లో కలిసిపోయారు. బిడ్డల మరణవార్త తెలుసుకుని వచ్చిన తల్లిదండ్రులు కొడుకా.. నువ్వు లేని జీవితం మాకెందుకురా.. పెద్ద డాక్టర్ అవుతానంటివి. అంతలోనే నీకు నూరేళ్లు నిండాయా అంటూ పలువురు తల్లిదండ్రులు పెద్దాస్పత్రి మార్చురీ వద్ద రోదించారు. అరె మామా.. ఒరేయ్.. రారా అంటూ పిలుచుకున్న తమ సహచరులు మృతి చెందారన్న విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు పెద్ద ఎత్తున జీజీహెచ్‌కు తరలివచ్చారు. కొందరు సహచర విద్యార్థినులు బిగ్గరగా ఏడవగా, మరికొందరు విషణ్ణ వదనాలతో కన్నీటి పర్యంతమయ్యారు.



నరేష్, అభిసాయి, అభిషేక్ రాజ్, జీవన్ చంద్రారెడ్డి , గుర్రం యగ్నేష్, రమణయ్య మృతదేహాలు

నెల్లూరు(అర్బన్)/కోవూరు: నెల్లూరు పెద్దాస్పత్రిలో తల్లిదండ్రులు, స్నేహితుల ఆర్తనాదాలు మిన్నంటాయి. నారాయణ మెడికల్ కళాశాలలో రెండో సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న మెడికోలు ఐదుగురు మృతి చెందిన విషాద ఘటన చూసిన పలువురి కళ్లలో నీళ్లు తిరిగాయి. కళాశాలలో మెడిసిన్ చదువుతున్న తమ స్నేహితుడి సోదరి నిశ్చితార్థానికి పలువురు మెడికోలు కార్లలో బుచ్చిరెడ్డిపాళెం వెళ్లారు. తిరిగి ఒక కారులో ఆరుగురు వస్తుండగా కోవూరు మండలంల పోతిరెడ్డిపాళెం మలువు వద్ద వేగంగా నడుపుతున్న కారును అదుపు చేయలేకపోయారు. రోడ్డు పక్కనే ఉన్న చిల్లర దుకాణంలోకి దూసుకెళ్లింది. క్షణాల్లోనే ఘోర ప్రమాదం జరిగిపోయింది. దుకాణం యజమాని నందిగంట వెంకటరమణయ్య (58)తో పాటు మరో ముగ్గురు మెడికోలు అక్కడికక్కడే మృతి చెందారు. నెల్లూరులో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మరో ఇద్దరూ మృతి చెందారు. వీరిలో వీరమల్లు నవనీత్ శంకర్ కోమాలో పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతని పరిస్థితి విషమంగా ఉంది.

మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

జీజీహెచ్ మార్చురీలో ఐదుగురు మెడికోలు భీమావత్ అభిషేక్‌రాజ్ (20), గుండాల జీవన్ చంద్రారెడ్డి(20), గుర్రం యజ్ఞేశ్ (19), లవదీయ నరేష్‌నాయక్ (20), గోను అభిసాయి పురుషోత్తం(19)తోపాటు వెంకటరమణయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

ఒక్కొక్కరుగా వస్తున్న తల్లిదండ్రులు

విద్యార్థుల స్వగ్రామాలు దూరంగా ఉండడంతో వారు రావడం ఆలస్యమయింది. అయితే జిల్లాలోని సంగం మండలం సిద్దీపురానికి చెందిన గుండాల జీవన్‌చంద్రారెడ్డి తల్లి విజయలక్ష్మి మార్చురీ గది వద్దకు చేరుకుంది. బిడ్డ మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించి సొమ్మసిల్లి పోయింది. మెడికల్ కళాశాల విద్యార్థినులు ఆమెకు దగ్గరగా చేరి ఓదార్చారు. తన బిడ్డలేని జీవితం మాకెందుకంటూ విజయలక్ష్మి రోదిస్తుండడంతో ఓదార్చడం ఎవరితరం కాలేదు. ఒంగోలుకు చెందిన యజ్ఞేశ్ తల్లి కూడా రాత్రి 7.30 గంటల సమయానికి మార్చురీ వద్దకు చేరుకుంది. బిడ్డా డాక్టర్ అవుతానంటివి కదరా.. ఇంతలోనే తమకు కడుపుకోత మిగిల్చావా అంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తుంటే.. ఆమె బాధను తీర్చడం ఎవరి వల్ల కాలేదు. పొద్దుపోయాక మిగతా విద్యార్థుల కుటుంబ సభ్యులు వచ్చి తమ బిడ్డల మృతదేహాలను చూసి విలవిల్లాడిపోయారు.

మేమేమి పాపం చేశాం

పోతిరెడ్డిపాళెం వద్ద జాతీయ రహదారిని పక్కనే ఇంటినే దుకాణంగా చేసుకుని జీవనం సాగిస్తున్న వెంకటరమణయ్య మృతదేహం చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆయన కోడలు గిరిజ దేవుడు ఇంత శిక్ష విధించాడంటూ రోదించారు.

పోస్టుమార్టం చేయించిన పోలీసులు

ఏఎస్పీ సౌజన్యతోపాటు పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీసులు దగ్గర ఉండి మృతదేహాలకు పోస్టుమార్టం చేయించారు. తొలుత సిద్దీపురం గ్రామానికి చెందిన జీవన్‌చంద్రారెడ్డి భౌతికకాయాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం ఒంగోలుకు చెందిన యజ్ఞేశ్ భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిగతా వారి మృతదేహాలను పొద్దుపోయాక వచ్చిన వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్రమాదంపై ప్రసన్న దిగ్భ్రాంతి

కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం వద్ద జరిగిన కారు ప్రమాదంలో ఐదుగురు మెడికోలు, స్థానికుడైన వెంకటరమణయ్య మృతి చెందిన ఘటనపై మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. భావి భవిష్యత్ ఉన్న మెడికల్ విద్యార్థులు మృతి చెందడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. వారి తల్లిదండ్రులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇదే ఈ ఘటనలో వెంకట రమణయ్య మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. రోడ్డు పక్కనే చిన్నపాటి ఇంటిని ఏర్పాటు చేసుకుని అక్కడే దుకాణం నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న వెంకటరమణయ్య మృతి ఆ కుటుంబానికి తీరని లోటుని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అతివేగంతోనే ప్రమాదం
- సౌజన్య, ఏఎస్పీ

నారాయణ మెడికల్ కళాశాల విద్యార్థులు బుచ్చిరెడ్డిపాళెం నుంచి తిరిగి వచ్చే క్రమంలో అతి వేగంగా కారు నడిపారు. కారును నియంత్రించలేక పోయారని భావిస్తున్నాం. మధ్యాహ్నం 2 గంటలకు కళాశాలలో ఒక ముఖ్యమైన తరగతికి హాజరు కావాల్సి ఉన్న నేపథ్యంలోనే కారును వేగంగా నడిపి ప్రమాదానికి గురయ్యారని అనుకుంటున్నాం. కారు కూడా పూర్తిగా ధ్వంసం అయింది. ఇల్లు కూడా పూర్తిగా దెబ్బతినింది.

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ మేరిగ మురళి, ఆనం విజయకుమార్‌రెడ్డి



ఉగ్ర ఘటన దురదృష్టకరం

- వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇన్‌చార్జిల పరామర్శ
- రూ.5 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రమూకల పాశవిక కాల్పుల్లో కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదన్ మరణించడం దురదృష్టకరమని, ఆయన మృతి కుటుంబానికి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, నాయకులు అన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ మేరిగ మురళి, కావలి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, నెల్లూరురూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి మధుసూదన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి భార్య, పిల్లలు, తల్లిదండ్రులను పరామర్శించి అన్ని విధాలుగా తమ పార్టీ తరఫున అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మధుసూదన్ కుటుంబానికి ప్రతాప్‌కుమార్‌రెడ్డి రూ.5 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, అమరా వేదగిరి సుబ్బరాయుడుగుప్తా, గంధం ప్రసన్నాంజనేయులు, గుర్రం వెంకటేశ్వర్లు, నాగేశ్వరమ్మ ఉన్నారు.

3 లక్షల మందికి పింఛన్లు

నెల్లూరు (పొగతోట): జిల్లాలో గురువారం సామాజిక పింఛన్ల పంపిణీకి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. 3,05,804 మంది లబ్ధిదారులకు రూ.132 కోట్ల నగదును పంపిణీ చేయనున్నారు. సీఎం చంద్రబాబు ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెంలో లబ్ధిదారులకు పింఛన్ల నగదు పంపిణీ చేస్తారని అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు అయ్యప్పగుడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద సుమారు 50 సంవత్సరాల వ్యక్తిని రైలు ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి పక్కన క్యారేజీ పడి ఉంది. మెరిన్ కలర్ హాఫ్ హ్యాండ్ షర్ట్, ఆకుపచ్చపై తెలుపు డిజైన్ గల లుంగీ, బిస్కెట్ కలర్ టవల్ ధరించి ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.95
సన్నవి : రూ.65
పండ్లు : రూ.40



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 112
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 224
లేయర్ చికెన్	: 170

రైతులకు అండగా ఉంటాం

- వేణుగోపాలస్వామి భూముల కౌలు వేలం పాటలో అక్రమాలు
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లిన రైతులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కందుకూరు: రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారు. ఉలవపాడు గ్రామంలో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయ భూముల కౌలు వేలం పాటలో చోటుచేసుకున్న అధికార పార్టీ అక్రమాలు, దౌర్జన్యాలను బాధిత రైతులు జగన్ దృష్టి తీసుకెళ్లారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో వారు బుధవారం తాడేపల్లిలో జగన్‌ను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. 30 మంది రైతులు డిపాజిట్లు చెల్లించి టోకెన్లు తీసుకుని వేలం పాటలో పాల్గొనేందుకు వెళ్లగా దేవాలయ ఈఓ, సిబ్బంది, పోలీసులు, అధికార పార్టీ నాయకులు కలిసి అడ్డుకున్నట్లు చెప్పారు. అధిక ధరకు పాట పాడినా పట్టించుకోకుండా కేవలం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులనే కారణంతో బలవంతంగా బయటకు పంపించారని వివరించారు. గతంలో వేలం పాట ద్వారా భూములను దక్కించుకుని పంటలు సాగు చేశామన్నారు. ప్రస్తుతం పంట చేతికొచ్చే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యను విన్న జగన్‌మోహన్‌రెడ్డి వారికి అన్ని విధాలా భరోసా కల్పించారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు పార్టీ తరఫున ఫిర్యాదు చేస్తామని, అలాగే పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో కోర్టుల ద్వారా కూడా పోరాటం చేద్దామన్నారు. అక్రమాలకు పాల్పడిన అధికారులను భవిష్యత్‌లో వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పార్టీ పరంగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, రాఘవరెడ్డి, సీహెచ్‌వీ రామిరెడ్డి, ఎం మహేందర్, కేవీ నర్సారెడ్డి, కె.కృష్ణారెడ్డి, ఎం.రఘురామిరెడ్డి, శివారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతుల సమస్యలు

ఈ ఏడాది సరైన ధరల్లేక పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మధుసూదన్ యాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ తోకల కొండయ్య వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. పొగాకు సాగులో కందుకూరు ప్రాంతం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. వేలమంది రైతులు ఈ పంటపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. 2024 – 25 సీజన్‌లో పెద్దఎత్తున పంటను సాగు చేశారని చెప్పారు. అయితే వేలంలో గిట్టుబాటు ధరలు రావడం లేదని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అధినేతకు వివరించారు. క్వింటా పొగాకు సరాసరి ధర రూ.25 వేలు కూడా రావడం లేదని, దీంతో పెట్టుబడి ఖర్చు కూడా వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఊహించని ధరలు వచ్చాయని, ప్రస్తుత ప్రభుత్వం పొగాకు రైతుల గురించి పట్టించుకోవడం లేదని వివరించారు. దీనిపై స్పందించిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఏ రైతు కూడా సంతోషంగా లేరన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ధరల కోసం పార్టీ తరఫున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వివరించినట్లు నాయకులు తెలిపారు.

ఉలవపాడు మామిడికి గుర్తింపునకు ప్రణాళికలు

- కేవీకేలో శాస్త్రీయ సలహా సంఘ సమావేశంలో శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న ఐసీఏఆర్ నిర్మా డైరెక్టర్ శేషు మాధవ్

కందుకూరు రూరల్: ఉలవపాడు మామిడికి భౌగోళిక గుర్తింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఐసీఏఆర్ నిర్మా డైరెక్టర్ శేషు మాధవ్, ఐసీఏఆర్ అటారీ డైరెక్టర్ షేక్ ఎన్.మీరా తెలిపారు. కందుకూరులోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో బుధవారం శాస్త్రీయ సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంఘాలుగా ఏర్పాటు చేసి సెకండరీ అగ్రికల్చర్‌ను ప్రమోట్ చేయాలన్నారు. మిరపలో ఎల్‌సీఏ–643 రకం మంచి ఫలితాన్నిచ్చిందని, దీనిని రైతులకు చేరవేయాలన్నారు. కేవీకే హెడ్ జి.ప్రసాద్‌బాబు, శాస్త్రవేత్తలు జ్యోతి, వెంకటేష్, మయాంక్, నిహారిక, శ్రీరంగ, వివేక్‌లు గత సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాల ఫలితాలు, వచ్చే ఏడాది చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. నాబార్డ్ జిల్లా అధికారి బాబు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రమేష్, మత్స్యశాఖ అధికారిణి వర్షిణి, వెటర్నరీ డీడీ చంద్రశేఖర్, శ్రీధర్ తదితరులు పాల్గొని సలహాలు, సూచనలు చేశారు. నూతన మట్టి పరీక్షల క్షేంద్రాన్ని, విలువ ఆధారిత ఉత్పత్తుల్లో ఔత్సాహికుల తయారీ కేంద్రాన్ని అతిథులు ప్రారంభించారు.

అట్టహాసంగా సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం



వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులతో వీసీ తదితరులు

- కోలాహలంగా మారిన వీఎస్‌యూ ప్రాంగణం

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ బుధవారం అట్టహాసంగా మొదలైంది. ఈనెల 3వ తేదీ వరకు జరిగే మహిళల పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి 95 జట్లు వీఎస్‌యూకు చేరుకోవడంతో ప్రాంగణం కోలాహలంగా మారింది. నాలుగు పూల్స్‌గా విభజించి ప్రారంభించారు. పూల్–ఏలో ఉన్న తెలంగాణ యూనివర్సిటీ, స్వర్ణజిత్ గుజరాత్ స్పోర్ట్స్ యూనివర్సిటీల జట్ల మధ్య తొలి మ్యాచ్‌తో టోర్నమెంట్‌ను ప్రారంభించారు. వీసీ అల్లం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. సాయంత్రం 6 గంటల వరకు జరిగిన మ్యాచ్‌లు పోటాపోటీగా సాగాయి. టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమంలో వీసీ, ఇంకా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రిజిస్ట్రార్ పాల్గొన్నారు. వీసీ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను ఒకేలా తీసుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో మరిన్ని అంతర్ విశ్వవిద్యాలయ టోర్నమెంట్లను నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు.

తొలిరోజు ఇలా..

తొలిరోజు 20 మ్యాచ్‌లు జరిగాయి. మేవార్ యూనివర్సిటీ (రాజస్థాన్)పై శివాజీ యూనివర్సిటీ (కొల్హాపూర్), శ్రీ కుశల్‌దాస్ యూనివర్సిటీ (హనుమన్‌ఘర్)పై తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, రాజా మహేంద్రప్రతాప్‌సింగ్ స్టేట్ యూనివర్సిటీ (అలీఘర్)పై పుణ్యశ్లోక్ అహల్యాదేవి హోల్కర్ యూనివర్సిటీ (సోలాపూర్), కన్నూర్ యూనివర్సిటీ(కన్నూర్)పై యూనివర్సిటీ ఆఫ్ కేరళ (తిరువనంతపురం), చౌదరి చరణ్‌సింగ్ యూనివర్సిటీ (మేరట్)పై బెంగళూరు యూనివర్సిటీ, అన్నా యూనివర్సిటీ (చెన్నై)పై మహాత్మాగాంధీ యూనివర్సిటీ (నల్గొండ), హేమచంద్రాచార్య నార్త్ గుజరాత్ యూనివర్సిటీ (పాఠన్)పై, విక్రమ్ యూనివర్సిటీ (ఉజ్జయిన్), జేఎన్‌టీయూ (హైదరాబాద్)పై బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ (ఆగ్రా), ఎస్‌ఓఏ డీమ్డ్ యూనివర్సిటీ (ఒడిశా)పై బరకతుల్లా యూనివర్సిటీ (భోపాల్), ఏకలవ్య యూనివర్సిటీపై ఆంధ్రా యూనివర్సిటీ (విశాఖపట్నం), మోహన్‌లాల్ సుఖాడియా యూనివర్సిటీ (ఉదయ్‌పూర్)పై మంగళూరు యూనివర్సిటీ, మాధవ్ యూనివర్సిటీ (రాజస్థాన్)పై షహీద్ మహేంద్ర కర్మ విశ్వవిద్యాలయం (బస్తార్), రాజీవ్‌గాంధీ ప్రాద్యోగికి విశ్వవిద్యాలయం (భోపాల్)పై సౌరాష్ట్ర విశ్వవిద్యాలయం (రాజ్‌కోట్), రాజ్‌రిషి భార్తృహరి మత్స్య యూనివర్సిటీ (ఆల్వార్)పై దేవి అహిల్య విశ్వవిద్యాలయం (ఇండోర్), యూనివర్సిటీ ఆఫ్ కోట (కోట)పై ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్), మణిపూర్ యూనివర్సిటీ (కాంచీపూర్)పై కువెంపు యూనివర్సిటీ (శివమొగ్గ), మహాత్మా జ్యోతిరావు పూలే రొహిల్‌ఖండ్ యూనివర్సిటీ (బరేలీ)పై విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ (బెల్గావి), మౌలానా ఆజాద్ యూనివర్సిటీ (జోధ్‌పూర్)పై భూపాల్ నోబెల్స్ యూనివర్సిటీ (ఉదయ్‌పూర్), తెలంగాణ యూనివర్సిటీ (నిజామాబాద్)పై స్వర్ణజిత్ గుజరాత్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (దేశర్), జేఎన్‌టీయూ అనంతపురంపై డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మారత్వాడ యూనివర్సిటీ (ఔరంగాబాద్) విజయం సాధించాయి.



పోటీలో తలపడుతూ..

బైక్‌ను ఢీకొట్టిన కారు

- ఒకరి మృతి
- పలువురికి గాయాలు



ఘటనా స్థలంలో రమణయ్య మృతదేహం

కందుకూరు: ఓ వ్యక్తి మోటార్‌బైక్‌పై రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన బుధవారం నూతన జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. వలేటివారిపాళెం గ్రామానికి చెందిన కట్టా అంజయ్య, అతడి భార్య పుష్ప, కొడుకు అనిల్, కోడలు దివ్య బుధవారం మధ్యాహ్నం ఒంగోలులో జరిగిన బంధువుల వివాహానికి హాజరయ్యారు. తిరిగి కారులో స్వగ్రామానికి బయలుదేరారు. అదే సమయంలో పట్టణంలోని పోతురాజుమిట్ట ప్రాంతానికి చెందిన గోతాల వ్యాపారం చేసే ఎస్.రమణయ్య (60) పని నిమిత్తం బైక్‌పై ఉలవపాడు వెళ్లి తిరిగి కందుకూరు వస్తున్నాడు. ఈ క్రమంలో పట్టణ సమీపంలోని నూతన జాతీయ రహదారిని చుట్టుగుంట అడ్డరోడ్డు వద్ద దాటే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో అటువైపు నుంచి వలేటివారిపాళెం వెళ్తున్న అంజయ్య కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రమణయ్య ఎగిరిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. కారు పల్టీలు కొట్టి రోడ్డు కింద మట్టిదిబ్బపై నిలిచిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే స్పందించిన కారు అద్దాలు పగులగొట్టి లోపలున్న వారిని బయటకు లాగారు. పుష్ప తీవ్రంగా, మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. వారిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఎస్సీ పోస్టుల కేటాయింపు

నెల్లూరు(టౌన్): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి డీఎస్సీలో కేటగిరీల వారీగా కేటాయించారు. మొత్తం 673 పోస్టుల్లో 668 జెడ్పీ, మున్సిపాలిటీ, ప్రభుత్వ విభాగాల్లో ఉండగా, 5 పోస్టులు ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో ఉన్నాయి. అయితే 668 పోస్టులను కులాల వారీగా ప్రభుత్వం కేటాయించింది. ఇందులో మహిళలకు 33 శాతం పోస్టులను కేటాయించనున్నారు.

కేటగిరీ	ప్రభుత్వ, జెడ్పీ, ఎంపీపీ	మున్సిపాలిటీ	కార్పొరేషన్
ఓసీ	254	06	08
బీసీ – ఏ	48	01	01
బీసీ – బీ	60	00	01
బీసీ – సీ	05	01	02
బీసీ – డీ	43	01	02
బీసీ – ఈ	24	01	01
ఎస్సీ గ్రేడ్ – 1	06	01	03
ఎస్సీ గ్రేడ్ – 2	38	01	01
ఎస్సీ గ్రేడ్ – 3	48	01	02
ఎస్టీ	41	00	02
ఈడబ్ల్యూఎస్	62	01	02

ప్రజా సమస్యలపై పోరాటం

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న నేదురుమల్లి

సైదాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో బుధవారం డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. 2027లో జమిలీ ఎన్నికలు రాబోతున్నాయని, వాటిల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టిస్తుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అవుతారన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను నేతలకు వివరించారు.

కండలేరులో 45.288 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 45.288 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగకాలువకు 160, పిన్నేరు కాలువకు 100, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రొటోకాల్ పాటించరా?



హాజరైన జెడ్పీటీసీ సభ్యులు



డీఆర్వోకు ఫిర్యాదు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

- జెడ్పీ నిధులు మంజూరు చేస్తే శంకుస్థాపనకు ఆహ్వానించరా?
- సర్వసభ్య సమావేశంలో పీఆర్ అధికారులపై చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆగ్రహం
- సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- 2024 – 25 సవరణ బడ్జెట్, 2025 – 26 అంచనా బడ్జెట్‌కు ఆమోదం
- సమావేశానికి హాజరుకాని మంత్రులు, శాసనసభ్యులు

నెల్లూరు(పొగతోట): 'నెల్లూరు రూరల్ మండలంలో సౌత్‌మోపూరు పాఠశాలలో ప్రహరీ నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.16 లక్షలు కేటాయించాం. నిధులు కేటాయించిన నాకు ఆహ్వానం లేకుండా, ప్రొటోకాల్ పాటించకుండా గత నెల 29వ తేదీన ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ వ్యవహారం చూస్తుంటే సొమ్మొకరిది.. సోకొకరిది అనిపిస్తోంది. శంకుస్థాపన విషయం వివిధ పత్రికల్లో వచ్చాకే నాకు తెలిసింది' అంటూ జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పంచాయతీ రాజ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నెల్లూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ తాను సౌత్ మోపూరుకు వెళ్లినప్పుడు పాఠశాల ఆవరణలోకి పశువులు, పందులు వస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు చెప్పారన్నారు. వారి విజ్ఞప్తి మేరకు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. శంకుస్థాపన విషయంలో ప్రొటోకాల్ పాటించరా?, కనీసం సమాచారం కూడా ఇవ్వరా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ విషయంలో ఎన్ని పర్యాయాలు చెప్పినా అధికారుల్లో మార్పు రావడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఆర్వో ఉదయ్‌భాస్కర్‌కు రాతపూర్వకంగా చైర్‌పర్సన్ ఫిర్యాదు చేశారు.

అందరినీ అవమానించినట్లే..

జెడ్పీటీసీ సభ్యులు కల్పించుని చైర్‌పర్సన్‌కు అవమానం జరిగితే అందరికీ జరిగినట్లేనని నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంగా సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తామని పంచాయతీ రాజ్ ఎస్‌ఈ అశోక్‌కుమార్‌ని నిలదీశారు. ప్రొటోకాల్ విషయంలో ఎక్కడా నిబంధనలు పాటించడం లేదంటూ సభ్యులందరూ నినాదాలు చేశారు. కలెక్టర్ స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సమావేశం కొనసాగించారు. అంతకుముందు ఉగ్రదాడిలో చనిపోయిన వారికి, సంగం మాజీ జెడ్పీటీసీ ఇందూధర్‌రెడ్డి మరణానికి సంతాపంగా మౌనం పాటించారు.

అందుబాటులో ఉంచాలి

అరుణమ్మ మాట్లాడుతూ వచ్చే వ్యవసాయ సీజన్‌లో రైతులు ఇబ్బందులు పడకుండా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. వేసవి నేపథ్యంలో ప్రజలు ఇబ్బంది పడకుండా మంచి నీటిని సరఫరా చేయాలన్నారు. చింతారెడ్డిపాళెం మెడికవర్ హాస్పిటల్ జంక్షన్ వద్ద అండర్‌పాస్ నిర్మాణానికి అనుమతుల మంజూరుకు చర్యలు చేపట్టిన తిరుపతి ఎంపీ గురుమూర్తి తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. 24 నెలల నుంచి గౌరవ వేతనం మంజూరు చేయలేదంటూ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నిలబడి నిరసన తెలిపారు. దీనిపై సీఈఓ విద్యారమ మాట్లాడుతూ చైర్‌పర్సన్ కమిషనర్‌తో మాట్లాడారని, సమస్య త్వరగా పరిష్కారమవుతుందని తెలిపారు. 1010 వరి పంట సాగు చేయడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయనప్పుడు ఆ రకం విత్తనాలు సరఫరా చేయవద్దని కొందరు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వెంకటగిరి మండలంలో మహిళా ఎంపీటీసీ మూడు సమావేశాలకు హాజరుకాలేదని, దీనిపై ఎంపీడీఓకు సంజాయిషీ ఇచ్చినా ఆమెను సస్పెండ్ చేయాలని చూడటం సమంజసం కాదని నాయుడుపేట ఎంపీపీ ధనలక్ష్మి అరుణమ్మ దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి పలు అంశాలపై మాట్లాడారు. డీఆర్సీ, జనరల్‌బాడీ తదితర సమావేశాలకు తప్పనిసరిగా తిరుపతి జిల్లా నుంచి అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కావలి ప్రాంత జెడ్పీటీసీలు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సంగం కాలువ, కావలి పెద్ద చెరువు పనుల నిమిత్తం రూ.65 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆ పనులను త్వరగా పూర్తి చేసి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా పరిషత్‌కు సంబంధించి బడ్జెట్ అంచనాలపై ఆమోదం తెలిపారు. సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి వచ్చి పది నిమిషాలు కూర్చొని చర్చించకుండా వెళ్లిపోయారు.

బడ్జెట్ ఇలా..

2024 – 25 సంవత్సరం సవరణ బడ్జెట్, 2025 – 26 సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్‌ను సమావేశంలో పొందుపరిచారు. జిల్లా పరిషత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజినీరింగ్ విభాగాల ఆదాయ, వ్యయం వారీగా బడ్జెట్‌ను తయారు చేశారు. 2023 – 24లో నికర ఆదాయం రూ.207,15,96,173, వ్యయం రూ.198,24,88,7 91, 2024 – 25లో ఆదాయం రూ.374,44,38,880, వ్యయం రూ.297,41,48,290 అని డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు తెలిపారు. 2024 – 25లో సవరించిన బడ్జెట్‌లో ఆదాయం రూ.354,27,49,500, వ్యయం రూ.343,13,49, 900లుగా చూపించారు. 2025 – 26లో అంచనా బడ్జెట్ ఆదాయం రూ.379,80,03,800, వ్యయం రూ.368,93,90,000లుగా వెల్లడించారు. మిగులు బడ్జెట్ రూ.10,86,13,800లుగా అంచనా తయారు చేశారు.